### బాల్యమూ, బతుకూ విశాఖలోనే!

విశాఖపట్నంలో 01-07-1946లో పుట్టాను. పూర్తిపేరు దుంప హర నాథ రెడ్డి. నాన్న అప్పారావు రెడ్డి, అమ్మ అప్పల నరసమ్మ. ఇద్దరు తమ్ముళ్లు, నలుగురు చెల్లెళ్లు. ఇంటికి పెద్దవాడిని కాబట్టి బాధ్యతల్ని బాల్యంలోనే గుర్తిం చాను. చదువు, బి.హెచ్.పి.వి లో ఉద్యోగం, పదవీ విరమణ, ప్రస్తుత నివాసం అన్నీ విశాఖలోనే. సహధర్మచారిణి పేరు రమణీమణి. ఇద్దరు మగ పిల్లలు. రవీంద్రనాథ్, నవీన్. ఇద్దరికీ పెళ్లిళ్లు అయ్యాయి. మనవల్లు పుట్టారు. పెద్దవాడు నాతో ఉంటున్నాడు. రెండోవాడు అమెరికాలో ఉంటున్నాడు.

### సాహిత్య పంట మా ఇంటా వంటా లేదు

రాతలు నాకెలా వంటబట్టాయన్నది నాకు ఇప్పటికీ అర్థం కాని విషయం. మా కుటుంబంలో సాహిత్య నేపథ్యం లేదు. అయితే నాకు చిన్న ప్పటి నుంచి పుస్తకాలు చదవడం ఇష్టం. ఒంటరిగా రేడియోలో హిందీ పాటలు వినడం, ఇంగ్లీషు సినిమాలు చూడ్డం అభిరుచులు. ఎనిమిదో తర గతి చదువుతున్నప్పట్నించీ క్లాసులు ఎగ్గొట్టి లీలామహల్ థియేటర్‌కు పరు గులు తీసేవాణ్ణి. వెళ్లేది నేల క్లాసు... టిక్కెట్టు పావలా కాసు.. నలుగురితో



మనవడితో అర్నాద్ దంపతులు

కలిసి ఉండక నాలుగు గోడల మధ్య కాలం గడపడానికి ఇష్టపడేవాణ్ణి. తెలుగు నవలలు విపరీతంగా చదివేవాణ్ణి. ఆ రోజుల్లో నాలో నాకే తెలియని ఘర్షణ. అర్థంకాని, జవాబు దొరకని ప్రశ్నలు నాలో అలజడినీ, ఆందోళనను రేపేవి. ఎందుకో కసి, కోపం, బాధ, ఏదో న్యూనతతో సతమత మవుతున్నా ననిపించేది. సమాజానికి ఏదో చేయాలనిపించేది.

ఏమీ చేతకానివారే ముందుకు వెళ్ళలేక, వెనక ఉండలేక, ఏమీచేయలేని రచనలను ఆశ్రయిస్తారంటారు కొందరు. నా విషయంలో అది నిజమే అని పించింది. నాలో దొలుస్తున్న సామాజిక భావజాలాన్ని వెలిబుచ్చే సరైన మార్గం అక్షరాలే అనిపించింది. నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తూ ఊపిరాడనివ్వని ఆలోచనలను అక్షరబద్ధం చేసినపుడు మనశ్శాంతిగా ఉండేది. అంతర్వాహి నిగా ఉన్న అలజడి తగ్గేది. ఇక రచనలే నాలో రగులుతున్న అగ్నిజ్వాలను చల్లార్చేవనీ, ఆ బాధ నుండి విముక్తి కలిగించేవని గట్టిగా నిర్ణయించుకు న్నాను.

### మలి కథతో ఉద్యోగానికి ముప్పు

1972 ఏప్రిల్ నెలలో అచ్చయిన 'వేలంపాట' నా మొదటి కథ. రెండో కథ 'అన్యాయం' కూడా అదే నెలలో మరో పత్రికలో వచ్చింది. నా తొలి రచ నలను రెండింటినీ ఒకే నెలలో ఒకేసారి అచ్చులో చూసుకొని ఆనందించేను.

నా మిత్రులూ, తోటి ఉద్యోగులు అభినందించారు. కానీ మలికథతో మా కంపెనీ యాజమాన్యం ఆగ్రహించింది. ఉద్యోగం ఊడగొట్టడానికి సాహసిం చింది. అదృష్టం కొద్దీ నా తరపున మా ఛీఫ్ ఇంజనీర్ ఎ.పి.రావుగారు నిలబ డ్డారు. నా ఉద్యోగం నిలబెట్టడమే గాక నాకు విలువైన సలహా ఇచ్చారు. ''నువ్వు రాయడం ఆపకు. నీ ఉద్యోగం ఊడినాసరే నువ్వు రాస్తూనే ఉండాలి. నీ కలానికి పదునుంది. నీకు మంచి భవిష్యత్తు ఉంది'' అంటూ ఓ కొత్త కలాన్ని కానుకగా ఇచ్చి భుజం తట్టి ధైర్యం చెప్పారు. అప్పుడు నాకు ఒక కథకు ఉన్న బలమేమిటో దాని ప్రభావం ఎంతటిదో అర్థమయింది.

### 'చీకటోళ్లు' నవలతో పేరు మారింది

ఆ రెండు కథలతో పాటు మరో నాలుగైదు కథలవరకూ 'డి. హరనాథ రెడ్డి' పేరుతోనే రాశాను. ఒక అభ్యుదయ రచయిత్రి చెప్పిన మాటను పరిగ ణనలోకి తీసుకుని ఇంటిపేరు, కులం పేరు అనవసరమనిపించి 'చీకటో ళ్లు'తో 'అర్నాద్' నయ్యాను. ఇప్పటికీ ఆ పేరుతోనే రాస్తున్నాను. ఆ నవల బహుమతినే గాక నాకు అనూహ్యమైన కీర్తిని తెచ్చిపెట్టింది.

నేనేమీ విరివిగా, విపరీతంగా రాసేయలేదు. ముప్పై ఏళ్ళలో నేను రాసింది మూడు నవలలు, యాభై ఆరు కథలు మాత్రమే.

### రావిశాస్త్రి ప్రభావం

కథ ఎలా రాయాలో నాకు రావిశాస్త్రి రచనలు నేర్పాయి. ప్రత్యేకంగా వారి సాహిత్యం చదవమని చెప్పేవాళ్లు నాకు ఎవరూ లేని రోజులవి. అయితే ఆయన రచనలకు నేను అతుక్కుపోవడం చిత్రంగా జరిగింది. ఓ రోజు ఉదయం అమ్మ చెప్పగా వీధిలోని కిరాణా కొట్టునుంచి పటికబెల్లం తెచ్చాను. దాన్ని, పొట్లాం కట్టిన అచ్చుకాగితం రావిశాస్త్రి రాజు - మహిషి నవలది. ఉబుసుకపోక చదివాను. ఆ కాగితంలోని ప్రతి అక్షరం మంత్రాక్షరమై నా గుండెను తాకింది. ఆ బీజాక్షరాలు కుదిపి నా కాళ్ళను రావిశాస్త్రి రచనలవైపు నడిపించాయి. అంతే! అప్పటినుంచి రాచకొండ రచనా సాగరంలో తనివితీరా మునిగి తేలియాడాను. నా రచనలపై ఆయన ముద్ర స్పష్టంగా కనిపిస్తుందంటే గర్వపడ్డాను. వారి రచనలు నన్నొక రచయితగా నిలబెట్టినందుకు నా 'చీకటోళ్ళ'ను శాస్త్రి గారికి భక్తితో అంకితమిచ్చాను.

### కారా మాస్టారి కలయికతో ఒంటరితనం దూరం

తొలి నవల విజయంతో నాకు కాళీపట్నం రామారావు మాస్టారి పరిచయ భాగ్యం లభించింది. వారిని కలిశాక వారి స్నేహాన్ని విడిచి ఉండడం అసా ధ్యమనిపించింది. వారి సాంగత్యం వల్ల అతని మిత్రులతో నా పరిచయాలు పెరిగాయి. మాస్టారి చుట్టూ ఎప్పుడూ సాహితీ వాతావరణమే! ఆ వాతావ రణంలోకి నేను ప్రవేశించాక అంతవరకు నన్ను పీడిస్తున్న ఒంటరితనం అదృశ్యమైంది. కారాగారి సాన్నిహిత్యంతో ఎలాంటి సాహిత్యం రాయకూ డదో అవగాహనైంది. మాస్టారు నన్ను కూడా వాళ్ళ పెద్దబ్బాయి లాగే చూసుకునేవారు. ''నా సాంగత్యం నిన్ను రాయకుండా ఆపేస్తుందేమో, చెడి పోతావేమో నాయనా'' అని మాస్టారు ఒక్కోసారి బాధపడేవారు. ఆయన నన్ను చెడిపేయడమేమిటి? చెడువైపు జారిపోనివ్వకుండా నన్ను తీర్చిది ద్దారు. ఈ మాట ఎప్పటికీ నేను గర్వంగా చెప్పుకుంటాను. నేను ఏ రచన చేసినా అది ముందుగా మాస్టారికి చూపిన తరువాతే పత్రికలకు పంపే వాణ్ణి.

### అటకెక్కిన 'కథా వేదిక'

కారామాష్టారు, వివినమూర్తి, అత్తలూరి నరసింహారావు నేను కలిసి

'కథా వేదిక'గా ఏర్పడ్డాం. వివిధ పత్రికల్లోని కథలను వడబోసి మంచి కథలనుకున్నవి కొన్నింటిని ఏరి ఏడాదికో సంకలనం తీసుకురావాలని సంకల్పించాం. మొదటి ప్రయత్నంగా పన్నెండు కథలను కూడా ఎంపిక చేశాం. చాలామంది ప్రచురణ కర్తలను, సంప్రదించాం. ఎవరూ ముందుకు రాలేదు. నవలలు పబ్లిషర్స్‌కి కాసులు కురిపిస్తున్న రోజులవి. చివరికి ఒక ప్రచురణ సంస్థ మాస్టారి ముఖం చూసి ముందుకొచ్చింది. అయితే మేము ఎంపిక చేసిన 12 కథల్లో ఒక రచయిత కథను మినహాయించాలని మెలిక పెట్టింది. అందుకు మేం ఒప్పుకోలేదు. రాజీపడలేదు. ఫలితం... 'కథావేదిక' ప్రణాళికను అటకెక్కించక తప్పలేదు.

ఆ తరువాత 90వ దశకంలో రెండు మూడు సంస్థలు ప్రతిఏటా ఉత్తమ కథల సంకలనాలను తీసుకు రావడంతో మా ప్రయత్నం మరొకరికి స్ఫూర్తిని కలిగించందన్న తృప్తితో ఉన్నాం. నా కథలు కొన్ని రెండు సంపుటాలుగా వచ్చాయి. మొదటిది 'అర్నాద్ కథలు' 1981లో వస్తే, 2006లో వచ్చిన 'బంధం' కథల సంపుటిని కారా మాస్టారికి భక్తితో అంకితమిచ్చాను.

## నచ్చినవి

| | |
|---|---|
| కవి | : శ్రీ శ్రీ |
| రచయితలు | : అల్లం శేషగిరిరావు, కె.ఎన్.వై. పతంజలి |
| కథ | : యజ్ఞం (కాళీపట్నం రామారావు) |
| నవల | : రాజు – మహిషి (రాచకొండ విశ్వనాథ శాస్త్రిగారి అసంపూర్తి నవల) |
| నాటకం | : కన్యాశుల్కం (గురజాడ వెంకట అప్పారావు) |
| సినిమా | : అంకుర్ (హిందీ) |
| నటుడు | : చార్లీచాప్లిన్ |
| పాట | : కారులో షికారు కెళ్లే పాల బుగ్గల పసిడిదాన... (ఆత్రేయ) |
| నటి | : సావిత్రి |
| మిత్రుడు | : వ్యాసం శ్రీరామమూర్తి |
| గాయకుడు | : మహమ్మద్ రఫీ |
| గాయని | : పి. సుశీల |
| వంట | : కోడిపలావు |
| తీరికవేళల్లో | : ఎక్కువగా చదువుకోవడం. తక్కువగా రాసుకోవడం. మనవడితో ఆడుకోవడం. |

## నవల హిట్ – సినిమా ఫట్

'చీకటోళ్లు' నవలని ఎ.వి.ఎం. సంస్థ 'వాడని మల్లె' పేరిట సినిమా తీసింది. ఆ చిత్రానికి నన్నే సంభాషణలు రాయమన్నారు. సినిమా వాళ్ళకు నచ్చినట్లుగా మాటలు రాయడం ఇష్టంలేక కాదన్నాను. మొత్తానికి ఆ చిత్రం విడుదలై ప్రజాదరణ పొందలేకపోయింది. కానీ రష్యన్ ఫిలిం ఫెస్టివల్‌కు ఆ సినిమా ఎంపిక కావడం విశేషం. నాకు అదో తీపి జ్ఞాపకం. హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ వారు పాతికేళ్ళలో వచ్చిన మంచి కథలలో (1966–1985) 25 ఉత్తమ కథలను ఎంపిక చేసి 'తెలుగు కథ' పేరిట ఒక సంకలనం తెచ్చారు. అందులో ప్రఖ్యాత కథకుల కథలతో పాటు నా 'రిక్షా ప్రయాణం' కథ కూడా చోటు చేసుకోవడం నాకు ఎంతో ఆనందాన్నిచ్చింది.


## రెండో నవల ఒక సవాల్

1983–84 మధ్య నేను రచనా పరంగా ఒక సవాల్‌ని ఎదుర్కోవలసి వచ్చింది.ఆ నేపథ్యంలోనే 'ఈతరం స్త్రీ' అన్న రెండో నవల నా శ్రీమతి పేరుతో రాశాను. ఆ రోజుల్లో పెరుగుతున్న మధ్యతరగతి ఉద్యోగినుల కుటుంబ సమస్యలు, లైంగిక వేధింపులు ఈ నవలా వస్తువు. ఈ నవల సంచలనం రేపింది. నేను సవాల్‌ని ఎదుర్కొని విజయవంతంగా సీరియల్ నవల రాయగలిగానన్న సంతృప్తినిచ్చింది. అయితే ఈ సంతోషం మీద కనవశర్మ నీళ్లు చల్లారు. అలాంటి నవల రాసినందుకు నా ముఖంమీద తిట్టారు.

''నవలను చదవకుండా తిట్టారు. చదివి ఇంకా గట్టిగా తిట్టండి'' అని ఆ నవల అతనికిచ్చాను. చదివాక ఆయన నన్ను వాటేసుకుని అభినందించి ఊరుకోలేదు. మారుపేరు తీసి 'అర్నాద్' పేరుతోనే అతని సంస్థ నుంచే ఆ నవలను అచ్చేశారు. అంతటితో ఆగకుండా 'నవలా రచయితగా అర్నాద్' అంటూ ఆంధ్రజ్యోతి వారపత్రికలో ఒక వ్యాసం రాశారు.

## మూడో నవలకు పేరు మారింది

నా మూడో నవల 'ఎడిటర్' అన్న పేరుతో రావాలి. అదే పేరుతో ఒక పత్రికలో ప్రకటన కూడా చేశారు. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల సీరియల్‌గా రావాల్సిన 'నవల' ప్రచురణ ఆగిపోయింది. పత్రికలు... పాఠకులు... రచయితలు... సంపాదకులు.. వాళ్ళ చుట్టూ బిగుసుకున్న వాస్తవిక పరిస్థితులపై రాసిన నవల ఇది. ఆ నవలకే 'సాంఘికం' అని పేరు మార్చి పంపితే 1990లో ఒక మాసపత్రికలో అనుబంధ నవలగా వచ్చింది



వివినమూర్తి, కాళీపట్నం రామారావు, అత్తలూరి నరసింహారావుతో....

## రాచకొండ పురస్కారంతో జీవితం ధన్యం

రావిశాస్త్రిగారి రచనా మార్గాన్ని అనుసరించి కథారచనలు చేసిన నాకు 2006 సంవత్సరంలో రావిశాస్త్రి రచనా పురస్కారం అందుకున్నప్పుడు నా జీవితం ధన్యమనిపించింది. ఎన్నో కథలకు బహుమతులందుకున్నా ఈ అవార్డు నాకు ఇచ్చిన తృప్తి ఎక్కువ. నా సాహిత్యంపై పరిశోధన చేసేందుకు కూడా సన్నాహాలు జరుగుతున్నాయి.

## ఇప్పుడొస్తున్న కథల గురించి..

తెలుగు సాహిత్యంలో ప్రస్తుతం మనం గర్వించదగ్గ మంచి కథలు వస్తున్నాయికానీ నవలల పరిస్థితి నిరాశాజనకంగా ఉంది. ''ఫలానా రచయిత(త్రి) మంచి నవలల రాశారని అంటున్నామే గానీ, ఇప్పుడూ అలాంటివే రాస్తున్నారనీ వారు ఆంధ్రులు గర్వించదగ్గ గొప్ప నవలాకారు' లనీ గర్వంగా చెప్పుకోలేని కాలంలో ఉన్నామనిపిస్తోంది. ఇది ఆందోళన కలిగించే విషయం. రచయిత(త్రు)లందరూ ఆలోచించాల్సిన సమయం.

**– మేడా మస్తాన్ రెడ్డి**

